

పవిత్రోత్సవాలు ప్రారంభం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో పవిత్రోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఆకివీడుకు చెందిన భక్తులు సోమవారం రూ.1.65 లక్షలు విరాళంగా అందజేశారు.



రైతు వ్యధలకు అద్దం

విజయవాడకల్చరల్: డాక్టర్ వైఎస్సార్ కళా పరిషత్ ఆధ్వర్యంలో మొగల్రాజపురం సిద్ధార్థ అకాడమీలో నిర్వహిస్తున్న 43 వ జాతీయ సాంఘిక నాటికల పోటీలు సోమవారం ముగిశాయి.

న్యూస్‌రీల్

జిమ్నాస్టిక్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిమ్నాస్టిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఆర్‌పీఆర్ విఠల్, ఎన్.సుబ్బారావులు ఎన్నికయ్యారని ఎన్నికల నిర్వహణ అధికారి ఎన్.సందీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా ఎన్.శ్రీనివాసరెడ్డి, షేక్ షాజియా తారాసుమ్, ఎం.విశ్వేశ్వరరావు, కోశాధికారిగా ఎస్‌వీ శివప్రసాద్‌తో పాటు ఆరుగురు కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయ్యారన్నారు. ఎన్నికలు స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహించామన్నారు. ఎన్నికల పరిశీలకునిగా ఒలింపిక్ అసోసియేషన్ నుంచి బడేటి వెంకటరామయ్య వ్యవహరించారన్నారు. చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై ఫ్రాన్స్ విద్యార్థుల అధ్యయనం




తాడేపల్లిరూరల్: ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేసేందుకు ఫ్రాన్స్ విద్యార్థులు సోమవారం కుంచనపల్లి విచ్చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల వద్ద నుంచి వారి అనుభవాలను తెలుసుకున్నారు. అనంతరం పెనుమాక గ్రామంలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లారు. ఈ సందర్భంగా డీపీఎం కె.రాజకుమారి రైతులతో సమావేశం నిర్వహించారు. ఫ్రాన్స్ విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయానికి, రసాయన వ్యవసాయానికి మధ్య ఉన్న తేడాలను, ఆదాయ, వ్యయాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తులలో నాణ్యత, నిల్వసామర్థ్యం తేడాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎంయు అధితి, గ్రామీణ వ్యవసాయ అధికారి సాయికృష్ణ, సుమ, రోహెల్ పాల్గొన్నారు.

యార్డుకు 41,735 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 41,735 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 39,273 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.10,000 నుంచి 23,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,000 నుంచి రూ. 26,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 14,234 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.20 అడుగుల వద్ద ఉంది. ఇది 147.8214 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 1,350 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 808.90 అడుగుల వద్ద ఉంది. ఇది 32.6709 టీఎంసీలకు సమానం.

ఆగ్రహ జ్వాల

పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలపై జిల్లావ్యాప్తంగా నిరసనలు

- జనసేనాని దిగజారి వ్యవహరించడంపై మండిపాటు
- పవన్ వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లాలో ఆందోళనలు
- బాపట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- దిష్టిబొమ్మల దహనం



జీబీసీ రోడ్డుపై పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: రాష్ట్రంలో మహిళల అదృశ్యానికి వలంటీర్లే కారణమన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. పవన్ తీరుపై మండిపడిన వలంటీర్లు రోడ్డెక్కారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు. కొన్నిచోట్ల పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. మిగిలిన చోట్ల నిరసన ప్రదర్శనలకు దిగారు. పవన్ దిగజారి వ్యవహరిస్తున్నారని, రోజురోజుకూ విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం ప్రజాసేవలో ఉండే తమను విమర్శించడం తగదన్నారు. ప్రతినెల ఒకటో తేదీన తెల్లవారుజామునుంచే వలంటీర్లు వృద్ధుల ఇంటివద్దకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేస్తున్నారని, అన్నిప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేస్తున్నారన్నారు. ప్రజాసేవే ధ్యేయంగా వలంటీర్లు ఇంటింటికి సేవలందిస్తున్నారని, అటువంటిది తమను టార్గెట్ చేసి మాట్లాడటం దుర్మార్గమని వారు మండి పడుతున్నారు. పైగా మహిళల సమాచారాన్ని సేకరించి సంఘవిద్రోహులకు అందజేస్తున్నారనడం పవన్ దిగజారుడుతనానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. మహిళలంటే తమకు ఎనలేని గౌరవభావముందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి పథకాన్ని మహిళల పేరుతోనే ఇస్తున్నారని, తాము దగ్గరుండి పథకాలను మహిళలకు అందజేస్తున్నట్లు వారు చెబుతున్నారు. మహిళలు తమపై ఎక్కడ ఫిర్యాదు చేస్తే పవన్ చూశారో చెప్పాలని వలంటీర్లు ప్రశ్నిస్తున్నారు. వేలమంది మహిళలు కనిపించకుండా పోయారని, అందుకు తామే కారణమని పవన్ ఆరోపించడం దుర్మార్గమని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ పవన్ దిగజారి వ్యవహరిస్తున్నారని వారు మండిపడుతున్నారు.



పవన్ కల్యాణ్ ఫొటోలను చెప్పలతో కొడుతున్న మహిళా వలంటీర్లు

పవన్ వ్యాఖ్యలపై నిరసనలు..

- పవన్ వ్యాఖ్యలకు నిరసిస్తూ బాపట్ల పట్టణానికి చెందిన వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పవన్‌పై చర్యలు తీసుకోవాలంటూ పట్టణ సీఐ పి.కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు.
- వెదుళ్లపల్లిలో వలంటీర్లు పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన గడ్డిబొమ్మను దహనం చేశారు.
- వేమూరు నియోజకవర్గం చుండూరు మండలం వలివేరు గ్రామంలో వలంటీర్లు పవన్ వ్యాఖ్యలకు నిరసనగా ఆయన గడ్డిబొమ్మను దహనం చేశారు.
- భట్టిప్రోలు మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్లు పవన్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు.
- కొల్లూరు రెండవ సచివాలయం పరిధిలోని వలంటీర్లు పవన్ ఫొటోలు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.
- చిన్నపులివర్రు సచివాలయం పరిధిలోని వాలంటీర్లు పవన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి నిరసన తెలిపారు.
- చెరుకుపల్లి మండలం ఆరుంబాక గ్రామపంచాయతీకి చెందిన వలంటీర్లు పవన్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించి అనంతరం చర్యలు తీసుకోవాలంటూ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పవన్ వ్యాఖ్యలపై పలువురు వైఎస్సార్ సీపీ నేతలు స్పందించారు. పవన్‌కల్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఆయన భేషరతుగా వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని పార్టీ పర్చూరు ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్, అద్దంకి ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య తదితరులు డిమాండ్ చేశారు.

దమ్ము, ధైర్యం ఉంటే ఆధారాలతో నిరూపించాలి



నిత్యం ప్రజాసేవలో ఉండి పేదల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న మాపై నిరాధారమైన ఆరోపణలు చేయటం పవన్ కల్యాణ్ అవివేకానికి నిలువెత్తు నిదర్శనం. దమ్ము, ధైర్యం ఉంటే సాక్ష్యాలతో నిరూపించాలి. లేనిపోని ఆరోపణలు చేయటం నాయకుడి లక్షణం కాదు. ఏదైనా ఆరోపణలు చేసేముందు సాక్ష్యాధారాలతో చేయాలనే విషయం తెలుసుకోవాలి.

– వల్లు గోపి, వలంటీర్, పిన్నిబోయిన వారిపాలెం

ప్రభుత్వానికి లబ్ధిదారుడికి మధ్య వారధిలా పనిచేస్తున్నాం



ప్రభుత్వానికి, లబ్ధిదారుడికి మధ్య వారధిలా పనిచేస్తున్నాం. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఎంతోమంది కుటుంబాలకు వారి ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నాం. స్వచ్ఛందంగా సేవ చేస్తున్న మమ్మల్ని పవన్ కల్యాణ్ విమర్శించడం సరికాదు. వలంటీర్లు చేసే పనులకు గురించి పూర్తిగా తెలుసుకొని పవన్ కల్యాణ్ మాట్లాడితే బాగుంటుంది. ఎక్కడ ఎలాంటి అవకతవకలు లేకుండా ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందించడమే మా పని.

– టి.శృతి, బూదవాడ, జె.పంగులూరు మండలం

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు దారుణం



ఏలూరు సభలో వలంటీర్ వ్యవస్థపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. వలంటీర్లను, రాష్ట్రంలోని మహిళలను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణం. అమానుషంగా, నీచంగా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. అందుకు ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలి. ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

– ఎం.ఇంద్రారెడ్డి, మున్నంవారిపాలెం, చినగంజాం మండలం

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



బాపట్ల: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో అన్ని సచివాలయాల పరిధిలో కాలువల్లో పూడిక తొలగించాలన్నారు. గ్రామాల్లో ఉన్న రక్షిత తాగునీటి పథకాలను నిరంతరం శుభ్రం చేసుకోవాలన్నారు. జిల్లాలో డెంగీ, మలేరియా వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల15వ తేదీ నుంచి గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అమలు చేస్తున్న టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమం అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందన కార్యక్రమానికి 82 అర్జీలు వచ్చాయి. వీటిలో 60కిపైగా భూ సమస్యలు వచ్చాయని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో సేవా కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, పౌర సరఫరాల శాఖ డీఎస్‌ఓ విల్లేమ్స్, డీఎం శ్రీలక్ష్మి, రవాణా శాఖ అధికారి ఎ.చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహా ఉత్సవంగా.. ఆషాఢ సారె



దుర్గగుడిలో ఆషాఢ సారె తీసుకొస్తున్న భక్తులు

- దుర్గగుడికి రికార్డు స్థాయిలో తరలివస్తున్న 'సారె' భక్తబృందాలు
- క్యూలైన్లు.. ఆధ్యాత్మిక తరంగాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో మరో మహోత్సవంగా.. ఆషాఢ సారె చేరిందని చెప్పొచ్చు. రాష్ట్రంలో అతి పెద్ద దేవాలయాల్లో రెండో స్థానంలో ఉన్న దుర్గగుడిలో దసరా ఉత్సవాలు, భవానీ దీక్ష విరమణలు, శ్రావణమాసం ఉత్సవాలు, శాకంబరీదేవి ఉత్సవాల తర్వాత మహో ఉత్సవంగా ఆషాఢ సారె మారిందని ఆలయ అధికారులు, భక్తులు అంటున్నారు. ఈ ఏడాది ఐదు పది కుటుంబాలు బృందంగా ఏర్పడి సారెను సమర్పించారు. ఆదివారం ఒక్క రోజే 150కి పైగా భక్త బృందాలు, ఆరు వేలకు పైగా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో దసరా, భవానీ దీక్షల విరమణకు దేవస్థానం ఏర్పాట్లు చేసినట్టు ఆషాఢ సారెకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి వస్తుందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మాణమే ప్రత్యామ్నాయం..!

దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మహా మండపం దక్షిణ భాగంలో రూ. 28 కోట్ల వ్యయ అంచనాతో నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి అంచనాలు రూపొందించారు. ఇది పూర్తయితే భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు తిరుమల తరహాలో వారిని ఆ భవనంలోకి మళ్లించేలా నిర్మాణం జరుగుతుందని ఆలయ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఉత్సవాల సమయాల్లో రద్దీని నియంత్రించవచ్చని అధికారులు భావిస్తున్నారు. అప్పటి వరకు మహా మండపం ఐదో అంతస్తును క్యూ కాంప్లెక్స్‌గా మారిస్తే భక్తులకు ఇబ్బందులు తప్పే అవకాశం ఉందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మహా మండపం 5వ అంతస్తులో పూజా సామగ్రిని విక్రయించే దుకాణాలు ఉండగా, వాటిలో కొన్నింటిని కనకదుర్గనగర్‌కు తరలించారు. ఇక రెండు, మూడు దుకాణాలు మాత్రమే ఉన్నాయి. వాటిని తొలగిస్తే భక్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

వైభవంగా సారె సమర్పణ

విజయవాడ, గుంటూరు, ఉభయ కృష్ణా జిల్లాల నుంచి భారీ ఎత్తున భక్తులు బృందాలుగా తరలి వచ్చి సోమవారం అమ్మవారికి సారె సమర్పించారు. జి.కొండూరుకు చెందిన కోదండరామ భజన బృందానికి చెందిన 90 మంది భక్తులు, విజయవాడ ఎల్. శ్రీనివాస్ బృందానికి చెందిన 80 మంది, కోడూరు గ్రామ భక్త సమాజం ఆధ్వర్యంలో సుమారు వంద మంది భక్తులు, స్పృహ చారిటబుల్ ఆర్గనైజేషన్ వారి బృందానికి చెందిన 50 మంది సభ్యులు, మల్లికార్జునపేటకు చెందిన మరో 60 మంది, ఇతర బృందాలతో కలిసి మరో 700 మంది బృందాలుగా సారె సమర్పించారు.

రెండు అంతస్తుల్లో బారులు తీరిన భక్తులు

ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు. అమ్మవారి భక్తులు, సారె సమర్పణకు విచ్చేసిన భక్తులతో క్యూలైన్ మహా మండపం ఆరో అంతస్తు, ఐదో అంతస్తు నిండిపోయింది. సాధారణంగా శ్రావణ మాసంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు ఎటువంటి ఏర్పాట్లు చేయాలనే దానిపై ఆలయ అధికారులు నిర్వహించుకునే సమావేశంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చిస్తారు. అయితే ఆదివారం అదనపు క్యూలైన్లు లేకపోవడంతో అమ్మవారి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది.

రియల్ దందాపై కొరడా

- పొలాలే ప్లాట్లుగా మారుతున్న వైనం
- విచారణకు ఆదేశించిన జిల్లా కలెక్టర్
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- మామూళ్ల మత్తులో పర్యవేక్షణాధికారులు



చీరాల ఇంజినీరింగ్ కాలేజీ వద్ద ప్రభుత్వ ఉపాధ్యాయుడు వేస్తున్న అక్రమ లేఅవుట్

చీరాల: ఖాళీ భూమి కనపడిందా.. మాయల పకీరులా హాం ఫట్ చేసేస్తున్నారు అక్రమార్కులు. చీరాల కేంద్రంగా భారీగా రియల్ దందా జరుగుతోంది. కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయి. భూములకు ధరల రెక్కలు రావడంతో పంట పొలాలు కాస్త ప్లాట్లుగా మారాయి. కనీసం వ్యవసాయ భూములను నివాస స్థలాలకు మార్పిడి చేయడం లేదు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) నుంచి లేఅవుట్లకు అనుమతులు తీసుకోలేదు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు నయాపైసా చెల్లించలేదు. సెంట్ల కింద రిజిస్ట్రేషన్ చేస్తే ఎక్కువ మొత్తం చెల్లించాలని, పొలాలను పొలాలుగా చూపి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. జిల్లాలోని చీరాల, వేటపాలెం, పాపాయిపాలెం, రామాపురం, అక్కాయిపాలెం, దేశాయిపేట, ఈపూరుపాలెం, పట్టణంలో దండుబాట, జాలమ్మ గుడి ప్రాంతాల్లో 100కు పైగా అనధికార లేఅవుట్లు ఉన్నాయంటే చీరాలలో జరుగుతున్న రియల్ దందాను అర్థం చేసుకోవచ్చు.

మామూళ్ల మత్తులో పచ్చజెండా!

అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పర్యవేక్షణ అధికారులు మామూళ్లతో అక్రమాలకు పచ్చజెండా ఊపుతున్నారు. దీనికితోడు ఒంగోలు నుంచి దిగమర్రువరకు నేషనల్ హైవే ఉండడంతో ఇరువైపులా అక్రమ లేఅవుట్లు వేసి అక్రమ దందా చేస్తున్నారు. కనీసం ఏ అనుమతి లేకుండా భూమార్పిడికి దరఖాస్తు చేసుకున్నామని కొనుగోలుదారుడిని మోసం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ, మండలస్థాయి అధికారులు కాని అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఉన్నతాధికారుల నుంచి ఏదైనా ఫిర్యాదు అందితే కొద్దిరోజులు వీటికి అనుమతి లేదంటూ బోర్డులు పెట్టి వారం రోజుల్లో వాటిని తొలగిస్తున్నారంటే అధికారులకు ఏస్థాయిలో మామూళ్లు ముట్టుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

మోసపోతున్న కొనుగోలుదారులు..

చీరాల ప్రాంతంలో జనాభా సంఖ్య పెరుగుతుండటంతో పట్టణ విస్తీర్ణం కూడా పెరిగింది. దీంతో పంట పొలాలను కొనుగోలు చేసి వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ అక్రమ ప్లాట్ల వ్యవహారం అడ్డగోలుగా జరుగుతోంది. ఇప్పటికే ఎటువంటి సౌకర్యాలు లేని ప్రాంతంలో ప్లాట్లు కొందరికి అంటగట్టి సొమ్ము చేసుకున్నారు. రెవెన్యూ అధికారులకు కాసులు కొట్టడంతో క్షణాల్లో భూమార్పిడి చేస్తున్నారు. కనీసం నివాస యోగ్యమైన ప్రాంతమా? సౌకర్యాలు ఉన్నాయో లేవో కూడా పరిశీలన చేయడం లేదు. చీరాల ప్రాంతంలో వేస్తున్న మూడొంతుల లేఅవుట్లు కనీస అనుమతి కూడా తీసుకోకుండా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. అవగాహన లేని కొనుగోలుదారులు ప్లాట్లయితే కొనుగోలు చేస్తున్నారే కాని ఆ తర్వాత మున్సిపాలిటీతో పాటు పంచాయతీల నుంచి అనుమతులు రాకపోవడంతో పాటు బ్యాంక్‌లు ఇళ్లు కట్టుకోవడానికి రుణ సౌకర్యం కూడా ఇవ్వడం లేదు. దీంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు.

నిబంధనలకు పాతర..

ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నును కూడా రియల్టర్లు ఎగవేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంట పొలాలను ప్లాట్లుగా మార్చి లేఅవుట్లు వేయాలంటే ఆ పొలం మార్కెట్ విలువలో పదో వంతు కన్వర్షన్ ఫీజు పది శాతం ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన తర్వాత విస్తీర్ణంలో పదో వంతు స్థలం పార్కులకు, 23 శాతం స్థలం రోడ్లు, ఇతర అవసరాలకు వదలాల్సి ఉంటుంది. మిగిలిన స్థలంలోనే ప్లాట్లు వేసుకొని విక్రయించుకొనే అవకాశం ఉంటుంది. లేఅవుట్‌కు కూడా ప్రభుత్వం తప్పనిసరిగా అనుమతి ఇవ్వాల్సి ఉంది. ఇందుకు రియల్టర్ ప్రభుత్వానికి సెక్యూరిటీ డిపాజిట్ కూడా కొంత చెల్లించాల్సి ఉంటుంది. అలానే మంచినీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఇవన్ని అనుమతులు ఉంటేనే ప్లాట్లను రిజిస్ట్రేషన్‌కు రిజిస్ట్రార్ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ పంట పొలాల్లో వేసిన ప్లాట్లకు ఎలాంటి అనుమతులు లేవు. పొలాలన్నీ ప్లాట్లుగా మార్చుకొనేందుకు ప్రభుత్వానికి ఎటువంటి ఫీజులు చెల్లించడం లేదు. నేరుగా ప్లాట్లు వేసి ఇష్టారాజ్యంగా అమ్మేస్తున్నారు. 450 జీఓ ప్రకారం అనుమతులు లేని అక్రమ లేఅవుట్లను టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకొని ప్లాట్ల కోసం వేసిన రాళ్లను పీకేసే అధికారం ఉంది. అలానే అలాంటి ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దని రిజిస్ట్రార్‌కు సూచించి అవి రిజిస్ట్రేషన్ కాకుండా చూడాల్సి ఉంది. అవసరం అనుకుంటే కలెక్టర్ ద్వారా రిజిస్ట్రార్‌కు నోటిఫికేషన్ కూడా జారీ చేయవచ్చు. అధికారులు వీటిని పట్టించుకోకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ లేఅవుట్లను వేసి ప్లాట్లను అమ్మేస్తున్నారు. కొనుగోలు చేసిన వారు మాత్రం నష్టపోతున్నారు. ప్రభుత్వ అనుమతి లేకపోతే బ్యాంక్‌లు రుణాలు ఇవ్వడం లేదు. మున్సిపాలిటీ కాని, పంచాయతీ కాని రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక వసతులు కల్పించలేదు. ఇదిలా ఉంటే పట్టణంలో ఎల్‌పీఎస్ ద్వారా అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకొనే అవకాశం ఉన్నా అందుకు కూడా ఎవరూ ముందుకు రాకపోవడం విశేషం.

విచారణకు కలెక్టర్ ఆదేశం..

జిల్లాలోని చీరాల, వేటపాలెం, బాపట్లతో పాటు పలు ప్రాంతాల్లో అక్రమంగా లేఅవుట్లు వేసి ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా మోసం చేస్తున్నారంటూ సామాజిక కార్యకర్త దాసరి ఇమ్మానియేల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన అక్రమ లేఅవుట్లపై విచారణకు ఆదేశించి తనకు పూర్తి సమాచారంతో నివేదికను అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో రియల్ దందా నడిపిస్తున్న అక్రమార్కుల్లో వణుకు మొదలైంది.

తహసీల్దార్ ఏమంటున్నారంటే..

అక్రమ లేఅవుట్లు గురించి విచారిస్తున్నాం. నూతనంగా తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టానని, వేటపాలెం మండలంలో కొన్ని అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదించి చర్యలు తీసుకుంటామని వేటపాలెం తహసీల్దార్ అశోక్‌వర్ధన్ తెలిపారు.

చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: చిన్నారులు, గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనతతోపాటు, ఇతర అనారోగ్య సమస్యలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి నిర్వహించిన అధికారుల సమావేశంలో మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పేదలకు అత్యవసర చికిత్సలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. పాఠశాలల పిల్లల్లో రక్తహీనతను సమీక్షించి హిమోగ్లోబిన్ తగ్గకుండా చూసుకోవాలన్నారు. వసతి గృహాల్లో చిన్నారులకు రక్తశాతం పెంచేందుకు ఐఎఫ్‌ఏ మాత్రలు క్రమం తప్పకుండా ఇస్తూ పౌష్టికాహారంపై శ్రద్ధ వహించాలన్నారు. వర్షాకాలంలో సంభవించే నీళ్ల విరోచనాలు నివారించేందుకు కాచి చల్లార్చిన నీరు తాగడం, పరిసరాలు శుభ్రంగా ఉంచడం, నీటి నిల్వలు ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవడం, రాత్రిళ్లు దోమతెరలు వాడడం చేయాలన్నారు. అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. మలేరియా, డెంగీ వ్యాధులపై నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. దీంతోపాటు ఎన్‌సీడీ సర్వేను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో మధుమేహం, రక్తపోటు, కేసులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డాక్టర్ రత్నమన్మోహన్, డాక్టర్ అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి స్థానం




చీరాల అర్బన్: వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యవర్గంలో బాపట్ల జిల్లా నుంచి ఇద్దరికి రాష్ట్ర శాఖలో స్థానం కల్పించడంపై జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జా సురేష్, దండమూడి శాంతారావు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా కే.రేణుకారావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా కేఎస్‌సీ హరిప్రసాద్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీలో బాపట్ల జిల్లా వాసులు ఎన్నిక కావడంపై జిల్లా గౌరవాధ్యక్షుడు కే సుబ్బారావు, చీరాల మండల నాయకులు జీవీ సుబ్బారావు, అనిల్‌కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

తానా సభల్లో బీరం సుందరరావు



చీరాల అర్బన్: అమెరికాలో ఈనెల 7,8,9 తేదీల్లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) 23వ మహాసభల్లో చీరాలకు చెందిన కవి డాక్టర్ బీరం సుందరరావు సాహితీ సదస్సులో పాల్గొని తమ వాణి వినిపించారు. తానా నుంచి అందిన ఆహ్వానం మేరకు ఆయన తానా సభల్లో పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన తెలుగు సాహిత్యంలో 'యువ స్వరాలు' అనే అంశంపై సదస్సులో ప్రసంగించారు. అలానే తానా పాఠశాల విద్యార్థులు నిర్వహించే ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలి..

'గతంలో మా గ్రామంలో గొడవలు జరిగాయి. చాలా మంది గాయపడ్డారు. సుమారు 70 మంది అరెస్ట్ అయ్యారు. వాళ్లంతా త్వరలో జైలు నుంచి విడుదల అవుతున్నట్లు సమాచారం. వారు గ్రామంలోకి వస్తే మరోసారి గ్రామంలో గొడవలు జరిగే ప్రమాదం ఉంది. ముందస్తుగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలు అమర్చాలి. లేకుంటే మరోసారి గ్రామంలో రెండు వర్గాలు ఘర్షణ పడే ప్రమాదం ఉంది.' రామాపురం గ్రామ పెద్దలు ఎస్పీకి విన్నవించారు.

- రామాపురం గ్రామస్తులు వినతి
- స్పందనకు అర్జీల వెల్లువ
- భరోసా ఇచ్చిన ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: స్పందన అర్జీలు పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జిల్లా నలుమూలల నుంచి 59 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ వకుల్‌జిందాల్ వెంటనే సంబంధిత సీఐ, ఎస్‌ఐలతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రజలకు సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు.



ఎస్పీ వకుల్‌జిందాల్‌కు సమస్య వివరిస్తున్న బాధితులు

చంపాలని చూస్తున్నాడు..

నాకు ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. ఇద్దరు ఆడ పిల్లలు. ఇటీవల నా భర్త సుగుణరావు వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. నన్ను ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని, లేకుంటే చంపుతానని బెదిరిస్తున్నాడు. భయంతో నేను మా పుట్టింటికి వచ్చాను. నా భర్తతో పాటు మా అత్త అన్నామణితో నన్ను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

– మేరుగ చిన్నారి, గవినివారిపాలెం

దారి లేకుండా అడ్డుకుంటున్నారు

నా ఇంట్లోకి వెళ్లకుండా మా గ్రామానికి చెందిన పెరవలి రాజారత్నం, దోనేపూడి అనిల్, మస్తాన్ రావు, బోపాటి రవి, బుజ్జి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అదేమని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్, ఎంపీడీఓ విచారించి నాకు హక్కు కలిగిన బాటను కూడా నిర్ధారించారు. అయినప్పటికీ నన్ను ఇంట్లోకి వెళ్లనీయడం లేదు.

– పరిశా బేబి, పెదపూడి, అమృతలూరు మండలం

నమ్మించి రూ.9 లక్షలు మోసం చేశారు

నేను తెనాలికి చెందిన శ్రీదేవి వద్ద చిటీపాట కట్టాను. చెల్లించిన రూ.5.60 లక్షలు నాకు ఇవ్వలేదు. ఆమె బంధువులు ప్రమీలా, లక్ష్మి, ఝాన్సీ, శ్రీనివాసరావు, రంగారావు మొత్తం రూ.3.40 నా వద్ద తీసుకొని నా సొమ్మును నాకు తిరిగి చెల్లించమంటే చంపుతానని బెదిరిస్తున్నారు.

–యలవర్తి కృష్ణకుమారి, నల్లూరివారిపాలెం, రేపల్లె మండలం

బేషరతుగా క్షమాపణ చెప్పాలి..

పట్నంబజారు: వలంటీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిందలు మోపడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మండి పడ్డారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏలూరు బహిరంగ సభలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం, ప్రజల మధ్య సమన్వయంతో సంక్షేమ పథకాలను పేదలకు అందిస్తూ నిస్వార్థంగా ముందుకు సాగుతున్న వలంటీర్లపై నీలాపనిందలు మోపడం సరికాదన్నారు. ప్రజలకు మేలు చేస్తుంటే ఓర్వలేక పవన్ కల్యాణ్ ఇటువంటి వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు.

రూ. 70 లక్షలతో జీజీహెచ్ గైనకాలజీ వార్డు ఆధునీకరణ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ గైనకాలజీ వార్డును రూ. 70 లక్షలతో ఆధునీకరించేందుకు సీఐఐ ప్రజారోగ్య అధికారులు సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలసి చర్చించారు. జూన్ 13న జీజీహెచ్ గైనిక్ వైద్య విభాగాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినీతో సీఐఐ ప్రజారోగ్య అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో భాగంగా సోమవారం డాక్టర్ కిరణ్ కుమార్‌ను కలసి గైనకాలజీ వార్డు ఆధునీకరణపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో సీఐఐ ప్రజా ఆరోగ్య శాఖ డెప్యూటీ డైరెక్టర్ నిశాంత్ సాగర్, ప్రతినిధులు బి. శ్రీనివాస్ సతీష్, చంద్ర పట్నాయక్ పాల్గొన్నారు.



సీఐఐ ప్రతినిధులతో సమీక్షిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

వైద్య పరికరాలు విరాళంగా ఇచ్చేందుకు అంగీకారం

ఆసుపత్రికి అవసరమైన పోర్టబుల్ అల్ట్రా సౌండ్ స్కాన్ పరికరం అందించాలని సీఐఐ ప్రతినిధుల్ని డాక్టర్ కిరణ్ కుమార్ కోరగా అందుకు వారు అంగీకరించారు. గర్భస్థ శిశువు గుండె మానిటరింగ్ చేసేందుకు సీటీజీ మిషన్లు నాలుగు ఇవ్వాలని కోరగా దానికి కూడా అంగీకరించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్‌ఎంవో డాక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అన్ని పరీక్షలు ఉచితమే

డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'కిట్‌లు లేవు... బయటే చేయించుకోండి'... అంటూ ఓ పత్రికలో వచ్చిన (సాక్షి కాదు) వార్త కథనాన్ని ఆయన ఖండించారు. ప్రతిరోజూ ఓపీ విభాగంలో సెమి ఆటోమ్యాటిక్ మిషన్ ద్వారా 30 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. అందుబాటులో లేని పరీక్షలు ఆరోగ్యశ్రీ ఒప్పంద ల్యాబ్ ద్వారా 24 గంటలూ ఉచితంగా చేస్తున్నామన్నారు. ఆసుపత్రిలో సదరన్, గ్రీన్ యాపిల్ ఏజెన్సీల వారీ మిషన్‌లతో వైద్య పరీక్షలు కొంత కాలంగా చేస్తున్నట్లు వెల్లడించారు. సదరు కంపెనీ వారు మార్కెట్ రేటు కంటే అధిక ధరలతో కిట్‌లను విక్రయిస్తున్నారని వెల్లడించారు. గ్రీన్‌యాపిల్, సదరన్ ఏజెన్సీల కంపెనీల మిషన్‌లలో ఇతర కిట్‌లు పెట్టి వైద్య పరీక్షలు చేసేందుకు అనువుగా లేవన్నారు. యూనివర్సల్ మిషన్‌లు, యూనివర్సల్ కిట్‌లు ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సదరు ఏజెన్సీలకు పాతబకాయిలు చెల్లించి ఈనెల 6న ల్యాబ్‌లో తనిఖీలు చేసి 24 గంటలు ల్యాబ్ పరీక్షలు అందుబాటులోకి తీసుకు రావాలని ఆదేశించామన్నారు. అయినప్పటికీ కిట్‌లను సరఫరా చేసేందుకు గ్రీన్ యాపిల్, సదరన్ ఏజెన్సీల నిర్వాహకులు ముందుకు రాలేదన్నారు. మంగళవారం నుంచి ఎమర్జెన్సీ వార్డులో 24 గంటల ల్యాబ్ మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడించారు.

గంజాయి స్వాధీనం

మార్టూరు: స్థానిక జాతీయ రహదారి పక్కన ఉన్న నూలు మిల్లు కార్మికుడి వద్ద మార్టూరు పోలీసులు సోమవారం 800 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నూలు మిల్లు కార్మికుల సమాచారం మేరకు.. మిల్లు క్వార్టర్స్‌లో నివాసముండే ఒడిశా రాష్ట్రం భద్రక్ జిల్లా కొటారా గ్రామానికి చెందిన శివానంద సాహు అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ కమలాకర్ తనిఖీ నిర్వహించారు. అందులో భాగంగా సాహు నివాసంలో నిల్వ ఉంచిన 800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిపై ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని.. మహిళ దుర్మరణం

అద్దంకి: బైకును టిప్పర్ ఢీకొట్టడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని అద్దంకి- దర్శి రహదారిలోని కట్టకిందపాలెం సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు, స్థానికులు అందించిన వివరాలు... ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం నూజిళ్లపల్లి గ్రామానికి చెందిన విద్యారావు, భార్య స్వప్న(25) గ్రామం నుంచి బైక్‌పై అద్దంకి వచ్చారు. పట్టణంలో కావాల్సిన కూరగాయాలు, సరుకులు కొనుగోలు చేసి తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. ఈక్రమంలో బైక్ పట్టణ శివారులోని కట్టకిందపాలెం సమీపంలోకి రాగానే వెనుకగా వస్తున్న టిప్పర్ బైక్‌ను ఢీకొట్టడంతో స్వప్న అక్కడికక్కడే మృతి చెందింది. భర్త విద్యారావు గాయాలపాలయ్యాడు. మృతురాలికి ఇద్దరు చిన్నారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.



ఘటనా స్థలంలో రోదిస్తున్న మృతురాలి బంధువులు

బాధితుల ధర్నా, టైర్లు కాల్చివేత..

మహిళను అన్యాయంగా టిప్పర్ ఢీకొట్టిందంటూ మృతురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడకు వచ్చిన పోలీసులతో మాకు ఇక్కడికక్కడే న్యాయం చేయాలని కోరారు. అయితే అక్కడకు వచ్చిన ఓ కానిస్టేబుల్ మృతిరాలి బంధువులతో దురుసుగా మాట్లడడంతో మాకు ఇప్పుడే న్యాయం చేయాలని సీఐ, ఎస్‌ఐ ఇక్కడికి రావాలని మోటారు బైకులను రహదారికి అడ్డంగా పెట్టి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ ఉమేశ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి బంధువులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. దగ్గరలో పడేసి ఉన్న టైర్లను తీసుకుని వచ్చి రోడ్డుపై వేసి దహనం చేశారు. ఎట్టకేలకు సీఐ వారికి సర్ది చెప్పి స్టేషన్‌కు రండి మాట్లాడదాం అని చెప్పడంతో శాంతించారు.

ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు చేపట్టాలని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా కోరారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా- 2024పై అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులతో సమావేశం సోమవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అందులో భాగంగా ఈనెల 21వ తేదీ నుంచి ఇంటింటా విచారణ చేపడుతామని తెలిపారు. ఈనెల 21 నుంచి 2024 సంవత్సరం జనవరి 5వ తేదీ వరకు నిర్వహించే షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ ప్రకటించిందని చెప్పారు. రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలోని ఓటర్ల విచారణ ఆగస్టు 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 22వ తేదీ నుంచి సెప్టెంబర్ 29వ తేదీ వరకు జాబితాలోని తప్పులు, పొరపాట్లను పరిశీలించే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఎపిక్ కార్డుల పరిశీలన, వలస ఓటర్ల విచారణ, చిరునామాల మార్పు, పోలింగ్ కేంద్రాలలో తప్పులు, పొరపాట్ల పరిశీలన, సరి చేసే ప్రక్రియ ఇదే క్రమంలో కొనసాగుతుందని వివరించారు. అక్టోబర్ ఒకటి నుంచి 16వ తేదీ వరకు అంతరాలు, ముద్రణలో పోలింగ్ కేంద్రాల పొరపాట్లు, మార్పులను సరి చేస్తామన్నారు. అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఉంటుందని చెప్పారు. డిసెంబర్ 26వ తేదీ నాటికి స్వీకరించిన అభ్యంతరాలను పూర్తిగా పరిష్కరించి, 2024 సంవత్సరం జనవరి 5వ తేదీన ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా ప్రకటించనున్నట్లు ప్రకటించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

పారదర్శకంగా ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా

పారదర్శకంగా ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా రూపొందిస్తామని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఈనెల 15వ తేదీలోగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల నాయకులతో అధికారులు సమావేశాలు నిర్వహించి, ఆయా పార్టీలకు షెడ్యూల్ ఇవ్వాలన్నారు. రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను సిద్ధం చేసుకోవాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఏజెంట్లను నియమించుకోవాలని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. రాజకీయ పార్టీల సమక్షంలోనే ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, ఆర్డీఓలు జి.రవీందర్, పి.సరోజిని, పార్థసారథి, వైఎస్సార్ సీపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం, జనసేన, బీఎస్పీ నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, ఏ వెంకటేశ్వర్లు, సిహెచ్.గంగయ్య, కోటేశ్వరరావు, వెంకట శివన్నారాయణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సహకార సంఘాలను నవీకరణ చేయాలి

జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా

బాపట్ల: సహకార సంఘాలను కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నవీకరణ ప్రక్రియను అధికారులు చేపట్టాలని జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా ఆదేశించారు. జిల్లాలోని సహకార సంఘాల నమోదు, అభివృద్ధిపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో సోమవారం నిర్వహించారు. సంఘాలను నేషనల్ కో-ఆపరేటివ్ డేటాబేస్‌లోకి తీసుకురావాలన్నారు. సహకార సంఘాల ఆధీనంలో జన ఔషధి కేంద్రాలను నడపడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బాపట్ల జిల్లాలో 7 పెట్రోల్ బంకులు నడపడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వ్యవసాయ సీజన్లో 49 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను ప్రాథమిక సహకార సంఘాల ద్వారా విక్రయించాలని కలెక్టరు వెల్లడించారు. మార్కెటింగ్ సొసైటీల సహకారంతో విక్రయాలకు సంసిద్ధం కావాలన్నారు. ధాన్యం, కంది, శనగలు, మొక్కజొన్న, పసుపు పంటలను రైతుల నుంచి ప్రాథమిక సహకార సంఘాలు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సహకారశాఖ అధికారి రామారావు, మత్స్యశాఖ అధికారి సురేష్, పశుసంవర్థక శాఖ అధికారి హనుమంతరావు, పి.డి.సి.సి బ్యాంక్ సి.ఇ.ఓ వై.ప్రకాష్ పాల్గొన్నారు.



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీఆర్ఎస్ఏ నాయకులు

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక సోమవారం నిర్వహించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సిహెచ్.సురేష్‌బాబు, ఓంకార్‌లను ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కె.నెహ్రూబాబు, బి.వెంకటేశ్వర్లు, ఆర్.వాసుదేవరావు, సహాధ్యక్షులుగా బి.సుశీల, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.సత్యనారాయణ, జిల్లా కోశాధికారిగా శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ శ్రీధర్, డీఆర్ఓ లక్ష్మీశివజ్యోతిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ కరోనా సమయంలో వలంటీర్ల సేవలను పక్క రాష్ట్రాలు కొనియాడారన్నారు. వలంటీర్లకు ప్రజలతోపాటు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వలంటీర్లు ఎవరూ నిరాశ చెందకుండా తమ విధులను నిర్వహించాలని కోరారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా అసత్యాలు ప్రచారం చేయటమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



పవన్ కళ్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే ఆమంచి

పర్చూరు(చినగంజాం): వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కళ్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పవన్ పరిపక్వత లేని నాయకుడని విమర్శించారు. వలంటీర్‌లు ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడిన ఆధారాలు ఉంటే బయట పెట్టాలని పవన్‌కు సవాల్ విసిరారు. చంద్రబాబు ఆడమన్నట్లు ఆడటం మంచిది కాదని హితవు పలికారు. కరోనా కష్టకాలంలో రెండేళ్లపాటు చంద్రబాబు కనబడకుండా పారిపోయినప్పుడు పవన్ ఎందుకు ప్రశ్నించలేదని విమర్శించారు. దీనిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కరోనా సమయంలో వలంటీర్‌లు ప్రజలకు చేసిన సేవ మరువలేనిది అని కొనియాడారు. సమావేశంలో నాయకులు కఠారి అప్పారావు, కోట హరిప్రసాద్, జువ్వా శివరాం ప్రసాద్, నీరుకట్టు వాసుబాబు, ముప్పాళ్ల రాఘవ, తోకల కృష్ణమోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

పవన్ కళ్యాణ్‌పై డీఎస్పీకి ఫిర్యాదు

చీరాల: వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు సోమవారం చీరాల డీఎస్పీ ప్రసాదరావుకు ఫిర్యాదు చేశారు. వలంటీర్ల వ్యవస్థపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో 19వ వార్డు కౌన్సిలర్ మించాల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సల్లూరి అనిల్, నాయకులు వాసుమళ్ల వాసు, శ్రీను, యాతం మేరిబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కోలా శివ, అల్లాబక్షి, షేక్ బద్రూ, షేక్ ఖాదర్ బాషా, కావూరి బాలకోటి ఉన్నారు.

దిగజారుడు రాజకీయం..

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వార్డు వలంటీర్ల వ్యవస్థను కించపరిచేలా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంలోనూ, వార్డులోని ప్రజల అవసరాలను వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. 50 కుటుంబాలు ప్రజల బాగోగులు చూసుకుంటూ వారికి అన్ని విధాల సంక్షేమ పథకాలు అందించే వలంటీర్లను గురించి పవన్ కళ్యాణ్ దిగుజారుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

గత ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్లే ప్రతి నెల ఒకటో తేదీ తెల్లవారుజామునే ఇంటి తలుపు తట్టి పింఛన్ డబ్బులు అందిస్తున్నారన్నారు. దూర ప్రాంతాల్లో ఉన్నవారికి కూడా స్వయంగా వెళ్లి పింఛన్ ఇస్తున్న వారిపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారని విమర్శించారు.



చీరాల డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు